సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 8 । మే । 2024



తలసేమియా.. ప్రాణాంతకం!

తలసేమియా ప్రాణాంతక వ్యాధి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు వేలకు పైగా వ్యాధిగ్రస్తులున్నారు. 15రోజులకోసారి వీరికి రక్తం ఎక్కించకుంటే ప్రమాదమే.

IIలో▸

ఓటేసిన అధికారులు..



కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్ ఆర్డీవో టి.వినోద్‌కుమార్ మంగళవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఇరువురు ఓటు వేశారు.

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

ఎండ ప్రభావం కొనసాగనుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో గల ప్రాంతాల్లో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఆర్పీఎఫ్, క్యూఆర్టీతో పాటు జిల్లా పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు.ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సత్యనారాయణ, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఇచ్చోడ: సర్కారు ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో ఇచ్చోడ, నర్సాపూర్ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు 24 గంటల పాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతల వైద్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్‌వో సాధన, ఇచ్చోడ, నర్సాపూర్ వైద్యాధికారులు సాగర్, కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంసెట్

ఆదిలాబాద్‌టౌన్: అగ్రికల్చర్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన ఎంసెట్ మంగళవారం ప్రశాంతంగా సాగింది. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష కొనసాగింది. ఈ పరీక్షకు నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 93 మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 92 మందికి గాను 87 మంది హాజరైనట్లు పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు తెలిపారు. బుధవారం కూడా అగ్రికల్చర్ పరీక్ష ఉంటుందని, గురువారం ఇంజినీరింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలి



మాట్లాడుతున్న సాయిబాబు

ఎదులాపురం: భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం కార్మికవర్గం నడుం బిగించాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. మేడే వారోత్సవాల ముగింపు బహిరంగ సభను సీఐటీ యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా యూనియన్ కార్యాలయం నుంచి సభా స్థలి వరకు కార్మికులతో కలిసి ప్రదర్శనగా వచ్చారు. అనంతరం సభనుద్దేశించి మా ట్లాడారు. రాజ్యాంగంతో పాటు ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికవర్గమంతా ఏకమై పోరాడాలన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, కిరణ్, కోశాధికారి సునిత, ఉపాధ్యక్షులు మల్లేశ్, చిన్నన్న, శో భ, వెంకటమ్మ, సహాయ కార్యదర్శులు సు జాత, జితేందర్, దేవిదాస్, స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాఘవులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దత్తాత్రి, జిల్లాకమిటీ సభ్యులు పోచ్చన్న, అక్రం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి | ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ | ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ | సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు | ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు | ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి | బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇంట గెలువాలె



- ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా పార్లమెంట్ ఎన్నికలు
- ప్రచారంపై దృష్టి పెట్టిన ప్రజాప్రతినిధులు
- అసెంబ్లీ ఎలక్షన్స్ తర్వాత మారిన పరిస్థితులు
- అధికార కాంగ్రెస్‌లో చేరికలు ప్రభావం చూపేనా..?

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ సెగ్మెంట్‌లో పార్టీ గెలుపు ఒక లెక్క అయితే.. తమ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు సాధించడం మరో లెక్క. ఎమ్మెల్యేలకు ఇది ప్రతిష్టాత్మకంగా మారింది. దీంతో తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఆదరించినట్టే ఇప్పుడు తమ పార్టీకి వెన్నంటి నిలుస్తారా.. లేకపోతే పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆలోచన చేస్తున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాసన సభ ఎన్నికల నాటికి, ఇప్పటికీ పరిస్థితులు మారాయి. ప్రధానంగా అధికార కాంగ్రెస్‌లో చేరికలు పెరిగాయి. ఆ ప్రభావం ఏ విధంగా ఉంటుందనేది ఈ ఎన్నికల్లో స్పష్టం కానుంది.

ఆదిలాబాద్ జిల్లాలో..

- అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రామన్నపై గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం ఆయన్నే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే ఈ నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్ఠం చేయాలని అధిష్ఠానం ఆలోచించినప్పటికీ చేరికల విషయంలో కాంగ్రెస్ అసమ్మతి నాయకులు సుజాత, సాజిద్ ఖాన్, సంజీవ్ రెడ్డిలకు భంగపాటు ఎదురైంది. అయినప్పటికీ తాజాగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ప్రచారం చేస్తామని వారు ప్రకటించారు. ఇకబీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో అప్పటి మాదిరి ఓట్లను గడించాలని ఎమ్మెల్యే శంకర్ గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. అది ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాల్సిందే.
- బోథ్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుపై గెలుపొందారు. ఇక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్ మూడో స్థానంలో నిలిచారు. ఆయనే నియోజకవర్గ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. కాగా బీఆర్‌ఎస్‌కు చెందిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డాక్టర్ వన్నెల అశోక్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుకు మంచి మెజార్టీ ఇప్పించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యామ్‌నాయక్‌పై గెలుపొందారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెద్దగా మార్పులు చేర్పులు జరగలేదు. అయితే బీఆర్‌ఎస్ అభ్యర్థి సక్కుకు ఇక్కడినుంచి మంచి మెజార్టీ కల్పించిన పక్షంలో అది ఉపయుక్తంగా ఉంటుందనేది పార్టీ భావన. ఈ నేపథ్యంలో కోవ లక్ష్మి మరింత శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- సిర్పూర్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పపై గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కోనప్ప కాంగ్రెస్ లో చేరగా ఇక్కడ ఆ పార్టీ పటిష్టమైంది. బీఆర్‌ఎస్ మరో నేత అరిగెల నాగేశ్వర్ రావు కూడా హస్తం గూటికి చేరారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే హరీష్‌బాబు పార్టీ అభ్యర్థి నగేశ్‌కు మంచి మెజార్టీ సాధించేందుకు గట్టిగా కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిర్మల్ జిల్లాలో..

- నిర్మల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు ఇక్కడ మూడో స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇక్కడ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుతం మాజీ మంత్రి ఐకే రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నారు. కొంత మంది ద్వితీయ శ్రేణి నాయకులు కూడా హస్తం గూటికి చేరారు. కాగా బీజేపీలోకి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభ సత్యనారాయణ గౌడ్ దంపతులు చేరారు. బీజేఎల్‌పీ నేతగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల నాటి ప్రభావం ఈ నియోజకవర్గంలో తీసుకురావాల్సిన బాధ్యత ఉంది. దీంతో ఆయన ప్రచారంలో వేగం పెంచారు.
- ముధోల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డిపై గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్ మూడో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల తర్వాత ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ ముధోల్ బీజేపీ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. తన ప్రత్యర్థులంతా కాంగ్రెస్‌లో కలవడంతో ఇప్పుడు ఆయన ఈ ఎన్నికలను సవాలుగా తీసుకోవాల్సిన పరిస్థితి.
- ఖానాపూర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్‌పై గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పైడిపల్లి రవీందర్‌రావు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. కాగా ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన ఏకైక నియోజకవర్గం ఇదే. దీంతో ఈ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మంచి మెజార్టీ తీసుకురావాల్సిన బాధ్యత ఎమ్మెల్యే బొజ్జుపై ఉంది.

పలుచోట్ల వడగళ్లు



తలమడుగులో ఆరబెట్టిన జొన్నలు తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతు



దస్నాపూర్‌లో కురుస్తున్న వడగాళ్ల వాన



తాంసిలో కురుస్తున్న వర్షం

జిల్లాలో మంగళవారం ఇంద్రవెల్లి, సిరికొండ, తాంసి, తలమడుగు మండలాల్లో వడగళ్ల వాన కురిసింది. మధ్యాహ్నం వరకు మండుటెండతో భానుడు ప్రతాపం చూపగా 3 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన వర్షం మొదలైంది. పలుచోట్ల ఇళ్లపైకప్పులు లేచిపోయాయి. జొన్న, మామిడి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. తాంసి మార్కెట్‌యార్డులోని జొన్నల కొనుగోలు కేంద్రంలో వర్షానికి ధాన్యం బస్తాలు తడిశాయి. తలమడుగు మండలం పల్లి (బి), పల్లి(కె) గ్రామాల్లో జొన్నరైతులు చేతికొచ్చిన పంటను ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు. – ఇంద్రవెల్లి/తాంసి/తలమడుగు/సిరికొండ

మూడు నియోజకవర్గాలకు అదనపు ఈవీఎంలు

- రాజకీయ పార్టీల సమక్షంలో కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు రాజేంద్ర విజయ్, కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్స్ సప్లిమెంటరీ సెకండ్ ర్యాండమైజేషన్ మంగళవారం నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషాతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియ చేపట్టారు. కమిషనింగ్ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తిన ఈవీఎంల స్థానంలో అదనంగా కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు మంగళవారం సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఆయా నియోజకవర్గాలకు 50చొప్పున ఈవీఎంలను అదనంగా కేటాయించారు. ఇవి సెక్టోరల్ అధికారుల వద్ద రిజర్వ్‌లో ఉంటాయని తెలిపారు. పోలింగ్ సమయంలో ఏవైనా సాంకేతిక సమస్య తలెత్తితే, నిమిషాల వ్యవధిలోనే వారు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని వాటిని వినియోగంలోకి తీసుకురానున్నట్లుగా కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆదిలా బాద్, నిర్మల్ అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, కిశోర్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా తదితరులు పాల్గొన్నారు.

బడి.. దందా!

- వ్యాపార కేంద్రాలుగా ప్రైవేట్ పాఠశాలలు
- పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు మరూ
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు



ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆగడాలు జిల్లాలో మితిమీరుతున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కుతూ విద్యను వ్యాపారంగా మార్చేశాయి. పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం, టై, బెల్ట్, ఇలా అన్నీ బడిలోనే విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తల్లిదండ్రుల జేబుకు చిల్లు పెడుతున్నారు. వీటిని నియంత్రించాల్సిన విద్యాశాఖ 'మామూలు'గా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు చేపడుతున్నారు. పట్టణాలు, పల్లెల్లో తిరుగుతూ ఫీజు డిస్కౌంట్ ఇస్తామని తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతున్నారు. తీరా పరీక్షల సమయంలో మొత్తం ఫీజు కట్టాలని వేధించడం వీరికి షరా మామూలుగా మారింది. మరోవైపు ఇప్పటికే పుస్తకాలు, నోట్‌బుక్‌లు వచ్చాయని, డబ్బులు చెల్లించి తీసుకుపోవాలంటూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుండడం గమనార్హం.

సూపర్ మార్కెట్ తరహాలో..

పాఠశాలలు పునఃప్రారంభమైన సమయంలో జిల్లాలోని చాలా పాఠశాలలు సూపర్ మార్కెట్లుగా దర్శనమిస్తుంటాయి. విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లు, షూ, బెల్టు, యూనిఫాం సైతం అక్కడే విక్రయిస్తుంటారు. విద్యార్థులకు సంబంధించి పూర్తి సామగ్రి తమ వద్దే అన్ని కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు హుకూం జారీ చేస్తారు. గత్యంతరం లేక పేరెంట్స్ వారికి వేలాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. ఇదంతా విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ నామ్‌కే వాస్తేగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

విద్యాశాఖ ఉదాసీనత..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఏర్పాటు సమయంలో నిబంధనలు పాటిస్తేనే వాటికి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కొందరు అధికారులు, ఉద్యోగులు వారి నుంచి మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఫైర్‌సేఫ్టీ, ఆటస్థలం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, అర్హులైన ఉపాధ్యాయులు లేకపోవడం, తరగతి గదులు సరిపడా లేకపోయినా వాటి కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే విద్యాసంవత్సరంలోనూ వీరికి అడపాదడపా అమ్యామ్యాలు అందుతున్నట్లు వినికిడి. ఈ క్రమంలో నిబంధనలు విరుద్ధంగా చేపడుతున్న ఫీజులు వసూళ్లు, పుస్తకాల విక్రయాలు తదితర అంశాలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుంది. నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.

– ప్రణీత, డీఈవో

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా



విద్యార్థుల ప్రయోగాన్ని తిలకిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్:విద్యార్థులుశాస్త్రీయ దృక్పథం అలవర్చుకుని ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన వేసవి సైన్స్‌శిక్షణ శిబిరం ముగిసింది. ప్రభుత్వ డైట్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారం పాటు విద్యార్థులు నేర్చుకున్న అంశాలను వివరిస్తూ ప్రయోగాలు చేశారు. వాటిని ఆసక్తిగా తిలకించిన కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పెరుగుతున్న మూఢ నమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. శాస్త్రీయ వైఖరి, ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. సమాజంలో మూఢ నమ్మకాలు నిరోధించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, సెక్టోరియల్ అధికారి జే.నారాయణ, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ జయప్రదం చేయాలి

- జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్ మంచి మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్‌రావు అన్నారు. జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమ విజయవంతం కోసం వారి అభిప్రాయాలు స్వీకరించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ.. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ మంచి మార్గమని తెలిపారు. కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ అత్యధిక కేసుల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడుతున్నారు..

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- టూటౌన్ ఎదుట బీజేపీ నిరసన



టూటౌన్ ఎదుట గుమిగూడిన బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: హిందువులపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల క్రాంతినగర్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అరెస్టు చేయడంపై పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి టూటౌన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కేసుతో సంబంధం లేని వ్యక్తులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు భారీగా గుమిగూడడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్పీ గౌస్ ఆలంతో పాటు డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్సై సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బలగాలను మోహరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ అక్కడికి చేరుకొని ఎస్పీతో చర్చించారు. పోలీసుస్టేషన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ హిందువులను అక్రమంగా అరెస్టు చేయించి ఇబ్బందులకు గురిచేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే రీతిన వ్యవహరిస్తుందని అన్నారు. గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని పేర్కొన్నారు. కేసుతో సంబంధం లేని వ్యక్తులను అరెస్టు చేయడం సరికాదన్నారు. 24 గంటల్లో ఎస్పీ న్యాయ విచారణ చేపడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్పీ హామీ మేరకు నిరసన విరమించినట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

'దోస్త్' సహాయ కేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం 'దోస్త్' సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రేషన్, ఇతర అనుమానాలను ఇక్కడ నివృత్తి చేయనున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక లోపాలు సరిదిద్దేందుకు సహాయ కేంద్రంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్, దోస్త్ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9703533626, 94410 15766 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తలసేమియా.. ప్రాణాంతకం..!

- ఉమ్మడి జిల్లాలో రెండు వేల మందికిపైగా బాధితులు
- రక్తం ఎక్కించకపోతే ప్రాణాలకే ముప్పు
- బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పునర్జన్మ
- నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం



మంచిర్యాల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు బెంగళూరుకు వెళ్తున్న చిన్నారులు

మంచిర్యాలటౌన్: తలసేమియా.. ఓ ప్రాణాంతక వ్యాధి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా తలసేమియా బాధితులు ఉన్నారు. వైద్యపరీక్షలు చేస్తే గానీ ఈ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించలేరు. ఎంతమంది ఈ వ్యాధి బారిన పడుతున్నారనే దానిపై పూర్తిస్థాయిలో లెక్కలు లేవు. బాధితులకు ప్రతీ పక్షం రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉచితంగా రక్తం ఎక్కిస్తున్నారు. ఇలాంటి వ్యాధి బారిన పడిన వారిని కాపాడేందుకు వారికి ప్రధానంగా కావాల్సింది రక్తమే. నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

మంచిర్యాల బ్లడ్‌బ్యాంక్‌లో సేవలు...

తలసేమియా వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలకు అవసరమైన అన్ని పరికరాలు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో ఉన్నాయి. వ్యాధి నిర్ధారణకు అవసరమైన హెచ్‌బీఏ2 పరీక్ష చేసే హెచ్‌పీసీఎల్ మిషన్ అందుబాటులో ఉంచారు. సహజంగా తలసేమియా బాధితులకు 15 యూనిట్ల రక్తం ఎక్కించిన తర్వాత ఐరన్ చిల్లేషన్ మెడిసిన్ ఇవ్వాలి. ఈ మెడిసిన్ రోగి శరీరంలోకి తరచూ రక్తాన్ని ఎక్కించడం వల్ల పేరుకుపోయిన ఐరన్‌ను తగ్గిస్తుంది. దీంతో రోగిలో హెచ్‌బీ శాతం పెరుగుతుంది. ఈ మందు అందించే సెల్టైన్ బాక్స్ ఆర్‌బీసీ మిషన్(సీబీఆర్ఎం)ను మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీకి సింగరేణి సంస్థ అందజేసింది. తలసేమియా వ్యాధిని, రక్త క్షీణతను గుర్తించే హెచ్‌పీఎల్‌పీ పరికరం ఉట్నూరు, మంచిర్యాలలో అందుబాటులో ఉంది. శరీరంలో ఐరన్ లెవల్స్ పెరగడం వల్ల తలసేమియా వ్యాధిగ్రస్తులు 30 ఏళ్ల వరకే జీవిస్తున్నారు. సీరం అబార్ట్ ఐ 1000 ఎస్ఆర్ మిషన్‌ను మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీలో సింగరేణి వారి ఏర్పాటుతో తలసేమియా బాధితులకు ఉపయోగపడుతోంది.

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పునర్జన్మ

తలసేమియా బారిన పడి నరకాన్ని అనుభవిస్తూ, నిరంతరం రక్తాన్ని ఎక్కించుకుంటూ ఎన్నాళ్లు బతుకుతామో తెలియని స్థితిలో ఉండే చిన్నారులకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా పునర్జన్మ అందుతోంది. ఇందుకోసం మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ చొరవ తీసుకుని సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో బెంగళూరులోని భగవాన్ మహావీర్ జైన్ ఆసుపత్రికి జిల్లాకు చెందిన ఆరుగురిని గత నెల 21న మంచిర్యాల నుంచి పంపించారు. వ్యాధి శాశ్వత నివారణకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే మార్గం. ఇందుకు రూ.10 లక్షలు ఖర్చవుతుంది. ఈ వ్యాధిబారిన పడే వారిలో 90 శాతానికి పైగా పేదవారే కావడంతో రెడ్‌క్రాస్ సొసైటీ, సంకల్ప్ ఇండియా ఫౌండేషన్‌లు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందుకు వచ్చాయి. ఇది జన్యు సంబంధమైన వ్యాధి. ఎముక మూలుగులోని హిమోగ్లోబిన్‌లో ఉండే ఎర్ర రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోయి, శరీరానికి అవసరమైనంత రక్తం ఉత్పత్తి కాదు, ఒకవేళ ఉత్పత్తి అయినా ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు పడిపోయినప్పుడల్లా రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. సకాలంలో రక్తం అందించలేకుంటే ప్రాణాలకే ప్రమాదం. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు వ్యాధిగ్రస్తుడికి చెందిన వారి తల్లిదండ్రులు, తోబుట్టువుల బోన్‌మ్యారో మ్యాచ్ అయితేనే ఈ ప్రక్రియ చేపడతారు. వివిధ జిల్లాలకు చెందిన బాధితులకు రెడ్‌క్రాస్ ద్వారా తొలిదశ టెస్టులను చేయగా 9 మందికి వారి తల్లిదండ్రులు, తోబుట్టువుల బోన్ మ్యారో మ్యాచ్ కాగా, వారిలో ఆరుగురికి తుదిదశ టెస్టులు చేసి గత నెలలో బెంగళూరులోని మహావీర్ జైన్ ఆసుపత్రికి పంపించారు. మరో నెలన్నర రోజుల్లో వీరికి బోన్ మ్యారర్జ సర్జరీలు చేయనున్నారు. వీరికి అయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షలు, తల్లిదండ్రులు వారి ఆర్థిక పరిస్థితిన బట్టి రూ.2 లక్షలు భరిస్తే, మిగతా మొత్తాన్ని దాతల సహకారంతో సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సమకూరుస్తుంది. సింగరేణి సంస్థ ఇలాంటి చిన్నారులకు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు రాగా, హైదరాబాద్‌లో ముగ్గురు సింగరేణి కార్మికుల పిల్లలకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు.

లక్షణాలు.. జాగ్రత్తలు

తలసేమియా వంశపారపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. మైనర్, ఇంటర్మీడియెట్, మేజర్ ఇలా మూడు దశల్లో ఉంటుంది. తలసేమియా అల్ఫా, బీటా రెండు రకాలు. ఒక అల్ఫా చెంజ్ కానీ, ఒక బీటా చెంజ్ తగ్గినప్పుడు మైనర్ వ్యాధి ఉన్నట్లు. వీళ్లు వ్యాధిగ్రస్తులైనా రక్త మార్పిడి అవసరం లేదు. వీరు వ్యాధి తీవ్రతతో బాధపడరు. కానీ వారి నుంచి వారి పిల్లలకు వ్యాధి సంక్రమిస్తుంది. ఇంటర్మీడియెట్, మేజర్‌లో హిమోగ్లోబిన్(హెచ్‌బీ) తగ్గిన వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రోగి శరీరంలో ఒక యూనిట్ రక్తం ఎక్కిస్తే, ఒక గ్రాము హెచ్‌బీ పెరుగుతుంది. హిమోగ్లోబిన్ మెయింటనెన్స్ కనీసం 10.5 గ్రాములు శాతం ఉండేటట్లు చూసుకోవాలి. ప్రతీ 15 రోజులకోసారి వీరికి రక్తం అవసరం. జ్వరం రావడం, ఆకలి తగ్గడం, కామెర్లు, మూత్రం పసుపు రంగులో రావడం, ఇన్‌ఫెక్షన్ జరగడం, మనిషి ఎదుగుదల నిలిచిపోతుంది. హిమోగ్లోబిన్ తగ్గడంతో ఎముకల సాంద్రత తగ్గి ఎముకలు విరిగే అవకాశాలు ఉంటాయి. వ్యాధిగ్రస్తుల ఐరన్ సంబంధిత మందులు, ఆహార పదార్థాలు, వంటపాత్రలు వాడరాదు. కాల్షియం(ఎముకలను బలపరిచే) పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


ఇస్తారి (ఫైల్)

తాంసి: ఉపాధి హామీ పనులకు వెళ్లి వడదెబ్బకు గురైన కూలీ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన భీంపూర్ మండలం అర్లి(టి)లో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన మస్కాపూరి ఇస్తారి(36) రోజు మాదిరిగా శనివారం కూలీలతో కలిసి ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న క్రమంలో ఎండతీవ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. తోటి కూలీలు ఇంటికి తీసుకురాగా వాంతులయ్యాయి. రాత్రి మరోసారి వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు 108లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కాగా, మృతుడికి భార్య వాణి ఉంది.

చికిత్స పొందుతూ ఒకరు మృతి


మస్కరి గంగయ్య(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన మస్కరి గంగయ్య (60) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వన్‌టౌన్ ఏఎస్సై దైవశాల తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్య రెండు కిడ్నీలతో పాటు లివర్ చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 4న కడుపులో నీరు నిండిందని, వాటిని తీయించుకునేందుకు ఆదిలాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్తానని ఇంట్లో చెప్పి వచ్చాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఠాకూర్ హోటల్ సమీపంలో పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. గమనించిన ఆటోడ్రైవర్ కుటుంబీకులు సమాచారం అందించాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రుకుంబాయి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

అద్దంకి దయాకర్‌పై ఫిర్యాదు

నిర్మల్: జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఫిర్యాదు ఇచ్చారు. ఒక మతాన్ని కించపర్చేలా మాట్లాడటంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపైనా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో హార్వెస్టర్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సోన్: మండలంలోని సాకెర గ్రామంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో హార్వెస్టర్ దగ్ధమైంది. కామారెడ్డి జిల్లాకు చెందిన బాదవత్ రాజు వరికోతల నిమిత్తం తన హార్వెస్టర్‌ను సాకెర గ్రామానికి తీసుకువచ్చాడు. రాత్రివేళ షార్ట్ సర్క్యూట్‌తో హార్వెస్టర్‌లో మంటలు చేలరేగగా గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. దాని విలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి


చనిపోయిన గొర్రెల వద్ద గంగమల్లు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో మంగళవారం వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగమల్లు తన ఇంటి సమీపంలో గొర్రెల మంద ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం వీధి కుక్కలు మందలో చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. దీంతో ఆరు గొర్రెలు మృతిచెందాయి. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి మహేశ్ ఘటనాస్థలంలో పంచనామా నిర్వహించారు.

ఉద్యోగాలిప్పిస్తానని ఘరానా మోసం

- నకిలీ నియామకపత్రాలతో వంచన
- నిరుద్యోగులకు ఓ మహిళ టోకరా

నిర్మల్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానన్న ఓ మహిళ చేతిలో పలువురు యువకులు మోసపోయారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ పలువురు నిరుద్యోగులను ఏజెన్సీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించింది. ముందుగా కొంత నగదు ఇవ్వాలని కోరింది. దీంతో ఆమెను కలిసిన కొందరు నిరుద్యోగులు రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టజెప్పారు. పట్టణానికి చెందిన ఓ యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగంపై ఆశతో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు కోసం రూ.3 లక్షలు ఇచ్చాడు. వీరికి సదరు మహిళ నియామక పత్రాలు కూడా ఇచ్చింది. సంబంధిత ఉద్యోగాల్లో చేరేందుకు వెళ్లిన ముగ్గురు బాధితులకు అవి నకిలీ పత్రాలుగా తెలిసింది. విషయం తెలుసుకున్న ఓ నిరుద్యోగి సదరు మహిళను నిలదీయగా మోసం బయటపడింది. ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఒకరి వద్ద రూ.8 లక్షల నగదు తీసుకుని నకిలీ ఆర్డర్ కాపీలు చేతిలో పెట్టింది. ఉద్యోగం కోసం ఆరు నెలలు తిరిగిన బాధితులు తమ డబ్బులివ్వాలని వారు అడిగితే పోర్జరీ చెక్కులు, బాండ్లు రాసిచ్చి తప్పించుకుంది. నిలదీస్తే తమ పైనే కేసు పెడతానని బెదిరిస్తోందని బాధితులు వాపోయారు. నిర్మల్ పట్టణంలోనే పదుల సంఖ్యలో సదరు మహిళ బాధితులున్నారు. వీరికి రూ.కోటికి పైగా టోకరా వేసినట్లు సమాచారం. ఇంకా ఎంత మంది బాధితులున్నారో కొద్దిరోజుల్లో తెలవనుంది. ఉద్యోగాల పేరిట మోసగించిన మహిళపై బాధితులు బుధవారం ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఇచ్చోడ: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో మంగళవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు కనీసం రైల్వేలైన్ కూడా మంజూరు చేయలేకపోయాయని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ అభ్యర్థి మెస్రం జంగుబాపును గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్లమెంటరీ ఇన్‌చార్జ్ జగన్మోహన్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పార్టీ అధ్యక్షులు రత్నపురం రమేశ్, మార రాజన్న, మహిళా కన్వీనర్ లక్ష్మీయాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుగుణకు మద్దతుగా ప్రచారం చేస్తాం

- కాంగ్రెస్ అసమ్మతి నాయకురాలు సుజాత


మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ అసమ్మతి నాయకురాలు గండ్రత్ సుజాత అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని మాజీ మంత్రి సీఆర్ఆర్ నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయురాలు, ఎలాంటి మచ్చలేని అత్రం సుగుణకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి బరిలో నిలిపిందన్నారు. ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో అల్లూరి సంజీవ్ రెడ్డి, వసీమొద్దీన్, సంజయ్ దుబే తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 19వ వార్డు గాంధీనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న శోభాతాయి

ఎదులాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ తక్షణమే ఏర్పాటు చేసి, చైర్మన్‌గా రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశ్‌ను నియమించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా కన్వీనర్ తుల్జాపురే శోభాతాయి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యంత వెనుకబడ్డ ఎస్సీ ఉపకులాలకు సామాజిక న్యాయం జరగాలంటే వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. సమితి పోరాటాలు, డిమాండ్ల సాధనకు కాంగ్రెస్ మద్దతుగా నిలిచిందని అందుకే శాసనసభ ఎన్నికల్లో ఎస్సీ ఉపకులాలు ఆదరించినట్లు తెలిపారు. హామీపై స్పష్టత ఇస్తే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ ఉపకులాలు కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటాయన్నారు. ఇందులో సమితి మహిళా నాయకులు శోభ డొలే, కోమల్‌బాయి, లలితాబాయి, శీలతాయి, వర్షాబాయి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద మంగళవారం 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు సమాచారంతో గూడెం వద్ద తనిఖీలు నిర్వహించగా పలు గ్రామాల నుండి సేకరించిన రేషన్ బియ్యం మహారాష్ట్రలోని అహేరి, ఆళ్ళపల్లి గ్రామాలకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో 11 క్వింటాళ్ల బియ్యం, 5 ద్విచక్రవాహనాలు, ఆటో, సైకిల్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఖర్జెల్లికి చెందిన జునుగరి శ్రీనివాస్, తోటపల్లి భాస్కర్, డోకె రుషి, దిందా గ్రామానికి చెందిన విశ్వనాథ్ హరిలాల్, బాబాసాగర్‌కు చెందిన నందిపేట సంతోష్, చింతలమానెపల్లికి చెందిన బుర్రి అర్జయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కోనేరులో మునిగి వృద్ధుడి మృతి

దిలావర్‌పూర్: ఈత రాక కోనేరులో మునిగి వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన మల్లెల రామస్వామి(70) మంగళవారం తన కుమార్తెలు దిలావర్‌పూర్ ఎల్లమ్మ దేవస్థానం వద్ద పండుగ చేయగా వచ్చాడు. ఈ క్రమంలో గుడి దగ్గర గల కోనేరులో దిగి స్నానం చేసే క్రమంలో ఈత రాక నీటమునిగి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి

భైంసారూరల్: గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన ఒకరు నీట మునిగి మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కుబీర్ మండలం పాంగ్రా గ్రామానికి చెందిన దత్తాత్రి (46) ఈ నెల 5న చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో అతడి కుటుంబీకుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. చేపల వల చుట్టుకుని నీటిలో మునిగి చనిపోయినట్లు గుర్తించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై శ్రీకాంత్

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామ సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టి ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.2.77లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భైంసా నుంచి మూడు ద్విచక్రవాహనాలపై కుబీర్ వైపునకు వెళ్తున్న భగవాన్ గణేశ్ వద్ద రూ.లక్ష, పవార్ మాధవ్‌రావు వద్ద రూ.97వేలు, చాంద్‌రావు వద్ద రూ.80వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత


నగదును ఎస్ఎస్‌టీకి అప్పగిస్తున్న పోలీసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.1,52,500 నగదు స్వాధీనం చేసుకొని ఎస్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాజంపేటకు చెందిన చుంచు రాజమొగిళి రూ.88 వేలు, మహారాష్ట్రకు చెందిన జుబీర్ ఖాన్ రూ.64,500 తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల వేళ డేగకళ్ల నిఘా

- ఈసీ ఆధ్వర్యంలో వ్యయ పరిశీలకుల పర్యవేక్షణ
- ఎప్పటికప్పుడు అభ్యర్థుల ఖర్చులపై ఆరా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లోక్‌సభ ఎన్నికల్లో ధనబలానికి తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే జిల్లా సరిహద్దులతోపాటు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి వెంట తీసుకెళ్తున్న నగదు సహా బంగారం, వెండి ఆభరణాలు, మద్యం, చీరలు, ఇతర కానుకలు, వస్తువులు ఏవైనా గుర్తించి సీజ్ చేస్తోంది. మంచిర్యాల జిల్లాలో ఇప్పటి వరకు 749 తనిఖీల్లో రూ.3,71,36,272 పైగా విలువైన 89,508 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. 328 మందిని అరెస్ట్ చేసి 25 బెల్ట్ దుకాణాలు మూసి వేయించారు. ఇక వాహన తనిఖీల్లో భాగంగా 80 వాహనాల్లో రూ.97,72,502 నగదు, రూ.36,808 విలువైన ఇతర వస్తువులు సీజ్ చేశారు.

వ్యయ పరిశీలకులు..

ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐడీఏఎస్ స్థాయి అధికారులను ఈసీ వ్యయ పరిశీలకులుగా నియమించింది. లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ అభ్యర్థుల ప్రచార వ్యయాలను పరిశీలిస్తున్నారు. పెద్దపల్లి లోకసభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి(ఐడీఏఎస్) సమీర్ నైరన్‌తర్య జిల్లా రిటర్నింగ్, ఎన్నికల అధికారులతో సమావేశమై అభ్యర్థుల ఖర్చులపై ఆరా తీశారు.

సీ–విజిల్‌కు ఫిర్యాదులు..

సీ–విజిల్ యాప్ ద్వారా ఈ నెల 5వరకు 78 ఫిర్యాదులు అందాయి. వీటిలో మెజారిటీ ఫిర్యాదులు ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలకు సంబంధించినవే ఉన్నాయి. ఫిర్యాదు అందిన గంటన్నరలోగా సంబంధిత బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: న్యాక్, ఈజీఎంఎం–డీడీయుజీకేవై సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ప్లంబింగ్, శానిటేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా న్యాక్ కోఆర్డినేటర్ ఎం.నాగేంద్రం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయి 18 నుంచి 35ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణతో పాటు భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని తెలిపారు. అలాగే బుక్స్, యూనిఫాం, షూ, హెల్మెట్‌తో పాటు ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ సైతం అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని న్యాక్ వైటీసీ కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల అభ్యర్థులు 8328507232, 8790414049 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యథేచ్ఛగా అక్రమ లేఔట్లు


మంచిర్యాలలో హద్దు రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

- జిల్లా కేంద్రం, శివారు మండలాల్లోనూ
- రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు

మంచిర్యాలటౌన్: మున్సిపాల్టీల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ లేఔట్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు కొన్నింటిని తొలగిస్తున్నా పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు. అనుమతి లేని లేఔట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ మున్సిపల్ కమిషనర్లు లేఖలు రాయడంతో రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. అప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంతోపాటు పక్కనే ఉన్న మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా పలువురు లేఔట్లను ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఫిర్యాదులు అందిన వాటిపై మాత్రమే మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనుమతి లేని లేఔట్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కల్పించరు. ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వరు. ఆయా ప్లాట్లను కొనుగోలు చేసిన వారు భవిష్యత్‌లో ఒకవేళ ప్రభుత్వం అనుమతి ఇస్తే ఎల్ఆర్ఎస్ కింద అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ లేఔట్లపై పలువురు స్వచ్ఛంద సంస్థల సభ్యులు మున్సిపల్ కమిషనర్లకు ఇస్తున్న ఫిర్యాదుల మేరకు హద్దురాళ్లు తొలగించి, ఆయా సర్వే నంబర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్ రిజిస్ట్రార్‌లకు లేఖ రాస్తున్నారు. దీంతో వాటికి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. గత మార్చి 27న నస్పూరులోని సర్వేనంబర్ 38లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని నస్పూర్ కమిషనర్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని గర్మిళ్ల శివారు సర్వే నంబరు 210లో, రంగంపేట్‌లో ఏర్పాటు చేసిన అనుమతి లేని లేఔట్‌లలో రిజిస్ట్రేషన్లను చేయవద్దని సబ్ రిజిస్ట్రార్‌కు మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మార్చి 22న లేఖ రాశారు. మంచిర్యాలలోని శివారు ప్రాంతాలైన రంగంపేట్, ఆండాళమ్మ కాలనీ, పాత మంచిర్యాల, రాజీవ్‌నగర్, తిలక్‌నగర్, దొరగారిపల్లె, గర్మిళ్ల ప్రాంతాల్లో అక్రమ లేఔట్లు ప్రతీరోజు ఏదో ఒక చోట ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొన్నింటిలోని హద్దు రాళ్లను తొలగిస్తున్నా కొద్ది రోజులకు మళ్లీ వేస్తున్నారు. పూర్తిస్థాయిలో అక్రమ లేఔట్లపై చర్యలను తీసుకోకపోవడం వల్లనే అడ్డూ అదుపు లేకుండా పోయిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

క్లుప్తంగా

ఘనంగా అశోకుడి విగ్రహావిష్కరణ



అశోకుడి విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: మండలంలోని దుప్పాపూర్ గ్రామంలో గల బౌద్ధ విహార్‌లో సాహిత్య సామ్రాట్ అశోక విగ్రహాన్ని మంగళవారం బుద్ధఘోష్ బంతేజి ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో, గౌతమ బుద్ధుడి శాంతి మార్గం ద్వారా ముందుకు సాగాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, గ్రామ పెద్దలు శ్రీరామ్, కనక ప్రభాకర్, మాజీ సర్పంచ్ కనక సేవంత బాయి, మధుకర్, జ్ఞానోబా, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఇంద్రాదేవి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చైత్రమాసం పూర్తి కావడంతో మంగళవారం ఇంద్రవెల్లి మండలంతో పాటు ఉట్నూర్, గుడిహత్నూర్, నార్నూర్, ఆదిలాబాద్ తదితర గ్రామాల ఆదివాసీలు పెద్దసంఖ్యలో ఇంద్రాదేవి ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావు, ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అభిమానం చాటిన విద్యార్థి



చిత్రాన్ని బహూకరిస్తున్న వంశీ

నేరడిగొండ: ఇచ్చోడ మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి గులే వంశీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై తన అభిమానం చాటుకున్నాడు. ఎమ్మెల్యే చిత్రాన్ని తన ప్రతిభతో పెన్సిల్ ఆర్ట్ వేసి గీశాడు. మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి ఆ చిత్రాన్ని బహుమతిగా అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీని అభినందించారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికి పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

ఇచ్చోడ: ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీకి పని కల్పించే విధంగా సిబ్బంది చొరవ చూపాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. మంగళవారం మండలంలోని సిరిచెల్మలో చెరువులో మట్టి పూడికతీత పనులను ప్రారంభించి కూలీలతో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు అడిగిన ప్రతీ ఒక్కరికి వంద రోజులపాటు పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు. సిరిచెల్మ చెరువు మట్టి పూడిక తీతను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో నరేందర్‌గౌడ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ



దివ్యాంగులను సన్మానిస్తున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలో ఓటుహక్కు సద్వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా యువజన సర్వీసుల అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, సీఐ రమేశ్, ఎస్సై రాము, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, బూత్ లెవెల్ అధికారులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏపీఎం మాధవ్, పంచాయతీ సెక్రటరీలు, ఐకేపీ సిబ్బంది, సామాజిక సేవకుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు..!



పర్సువాడ నుంచి కునికాసా గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

- ఇప్పటికీ కాలినడకే శరణ్యం
- తిప్పలు పడుతున్న ఆదివాసీలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ఐటీడీఏ ఉన్నా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పల్లెపల్లెకు రోడ్డురవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చి గెలుపొందిన నాయకులు గెలిచిన తర్వాత గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో రోడ్లన్నీ అధ్వానంగా ఉండడంతో గిరిజనులకు కాలినడకే శరణ్యంగా మారింది. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న నాయకులను గిరిజనులు రోడ్ల దుస్థితిపై నిలదీస్తున్నారు.



బీటీ రోడ్డుకు నోచుకోని కునికాసా కొలాంగూడ నుంచి గాదిగూడ వెళ్లే రోడ్డు

ప్రజల ఇక్కట్లు..

గాదిగూడ మండలంలోని పర్సువాడ గ్రామపంచాయతీ కేంద్రానికి బీటీ రోడ్డు నిర్మించాలని గత 30 ఏళ్లుగా గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్లకు కూడా ఎన్నోసార్లు వినతిపత్రాలు సమర్పించారు. కానీ నేటికీ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు కాలేదు. మండలంలోని కునికాసా ఎస్సీగూడ, గోండుగూడ, కొలంగూడ గ్రామాలకు సైతం సరైన రోడ్డు రవాణా సౌకర్యాలు లేవు. రోడ్లన్నీ అధ్వానంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో 108, 102, వంటి అంబులెన్స్‌లు ఆయా గ్రామాలకు రాలేని పరిస్థితి ఉంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలు, ఎడ్ల బండ్లపై రోగులను, గర్భిణులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఆదివాసీ గిరిజనుల అభివృద్ధిలో ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

> **రోడ్డు సౌకర్యం కల్పిస్తాం**
>
> నియోజకవర్గంలోని అన్ని గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పార్లమెంట్ ఎన్నికలైన తర్వాత సమీక్ష నిర్వహిస్తా. కొన్ని గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయి. కానీ అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుంది.
>
> – కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్

బీజేపీతోనే దేశం అభివృద్ధి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

ఇంద్రవెల్లి: దేశం కోసం, ధర్మం కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. మంగళవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో కలిసి మండలంలోని దనోరా, ముత్నూర్ గ్రామాల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ పుష్పలత, రాజలింగు, నాయకులు ఉన్నారు.

నేరడిగొండ: బీజేపీతోనే అందరికి సమన్యాయం సాధ్యమవుతుందని పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గట్టు నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని యాపల్‌గూడ, ఇస్రుగూడ, బోరిగాం, సేవదాస్ నగర్, ఏసుగూడ గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతీఒక్కరికి సమన్యాయం చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ఎంపీటీసీ కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్ కోటేష్, మహేందర్ రెడ్డి, నరేందర్, వెంకటేష్, రాజేందర్ రెడ్డి, గంగారాం, పృథ్వీరాజ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: మండలంలోని నిగిని, కంటెగాం, బాబెర గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీకాంత్ పార్టీలో చేరారు. మండల కన్వీనర్ బోరె రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, సుభాష్, సూర్య, తుకారాం పాల్గొన్నారు.

బీజేపీ విస్తృత ప్రచారం

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ విస్తృత ప్రచారం చేపడుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇవ్వడం తప్పా వాటిని నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్, శ్రీనివాస్, సత్యం, జ్యోతిరెడ్డి, దయాకర్, ఫరీద్, నాందేవ్, ముకుంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయమైంది

గుడిహత్నూర్: ఎన్నికల వాతావరణం చూస్తుంటే బీజేపీ గెలుపు ఖాయమైందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పతంగె బ్రహ్మానంద్ అన్నారు. ప్రచారంలో భాగంగా మండలంలోని శాంతాపూర్‌లోని 117వ పోలింగ్ బూత్ పరిధిలో ఆయన ప్రచారం నిర్వహించారు. నాయకులు కేంద్రే శివాజీ, భరత్, కేంద్రే లక్ష్మణ్, వామన్‌గిత్తే తదితరులు ఉన్నారు.

బీజేపీ ర్యాలీ విజయవంతం చేయండి

నేరడిగొండ: ఇచ్చోడ మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు మద్దతుగా బుధవారం ప్రచారానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మహిళలు ర్యాలీ లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


అద్దంకి దయాకర్ ఫ్లెక్సీ దహనం



ఫ్లెక్సీ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: హిందూ దేవతలను కించపర్చే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన బహిరంగ సభల్లో అద్దంకి దయాకర్ హిందు దేవతలను కించపర్చుతూ మాట్లాడారన్నారు. బీజేవైఎం, బీజేపీ నాయకులు సూర్యకిరణ్, పాయల్ శరత్, మహేందర్, శివకుమార్, రాకేష్, రఘుపతి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవిశంకర్‌కు సన్మానం



రవి శంకర్‌ను సన్మానిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని ఏఆర్టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ రవిశంకర్‌ను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సన్మానించారు. మంగళవారం ఏఆర్టీ సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఏఆర్టీ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తానాజీ జాడే, గజానంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మైనర్లకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదుట రోడ్డుపై రైల్వేస్టేషన్ వైపు నుంచి వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. విద్యానగర్‌కు చెందిన ఇమ్రాన్, ప్రణీత్, జోహెద్ స్టేడియం నుంచి విద్యానగర్‌కు వెళ్లే క్రమంలో వారి వాహనాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో జోహెద్, ప్రణీత్‌ల కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో గల ఎస్సీ కాలనీ మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదని, కాలనీలో చేతిపంపు సైతం సరిగా లేక నీళ్ల కోసం అవస్థలు పడుతున్నామని వాపోయారు. దూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలుపుతూ మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మహిళలు పంచాయతీ కార్యాలయం వద్దకు ఖాళీ బిందెలతో వెళ్లి నీరు సరఫరా జరిగేలా చూడాలని కోరారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి విజయ్ ట్యాంకర్ ద్వారా కాలనీవాసులకు నీటి సరఫరా చేశారు. మహిళలు గంగమ్మ, విజయ, నాగమణి, దేవిక తదితరులు ఉన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బీఎస్పీతోనే బహుజన రాజ్యం

ఖానాపూర్: బీఎస్పీతోనే బహుజన రాజ్యం సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మేస్రం జంగుబాబు అన్నారు. పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేలా, హక్కులు రక్షించుకునేలా బీఎస్పీ పార్టీని గెలిపించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి జగన్‌మోహన్, మహిళా కన్వీనర్ లక్ష్మియాదవ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు రాజేశ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జంగుబాబు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

దహెగాం: వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీఎస్‌వో వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడ, కుంచవెల్లి, తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తూర్పారా పట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తప్ప, తాలు లేకుండా 17శాతానికి తేమ మించకుండా ధాన్యం ఉండాలని రైతులకు సూచించారు. ప్యాడీ క్లీనింగ్ మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీఈవో బక్కయ్య, సిబ్బంది ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో

పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమే స్వచ్ఛత

ఆదిలాబాద్‌టౌన్: దేశంలోని ప్రతీ గ్రామం స్వచ్ఛతగా, పరిశుభ్రతగా ఉందంటే పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఎక్కడికి వెళ్లినా పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యం ఇచ్చి సత్కరించి గౌరవిస్తున్నారన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌తో కలిసి వారిని ఓట్లు అభ్యర్థించారు. అశోక్, రవి, ప్రవీణ్, లాలామున్న, కృష్ణ, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బీజేపీకి ఓటు వేస్తే నమ్మించి మోసం చేస్తారు



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండలంలోని ధన్నూర్, కౌఠ బి గ్రామాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఆయనకు గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలన్నారు. బీజేపీకి ఓటు వేస్తే నమ్మించి మోసం చేస్తారన్నారు. నమో అంటేనే నమ్మించి మోసం చేయడమని, మోడీతో గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, జక్క బాపురెడ్డి, సదాశివ్, సురేందర్ యాదవ్, ప్రశాంత్, రాములు, రమణగౌడ్, రఫీ ఉన్నారు.

నేరడిగొండ: కారు గుర్తుకు ఓటు వేయాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. మండల ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, డాక్టర్ జహీర్, రవీందర్, సురేందర్, కరణ్ సింగ్, విశాల్, నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, సుజీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

జైనథ్: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మరోమారు మోసపోవద్దని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని భోరజ్, సిర్సన్న, రాంపూర్, కోర్ట, ఆకోలి, గిమ్మ, పూసాయి, పిప్పర్‌వాడ, మాండగడ తదితర గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో రోడ్‌షోలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ గోవర్ధన్, నాయకులు లింగారెడ్డి, నర్సింగ్ రావు, ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్ అన్నారు. మండలంలోని శాంతాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు'



ముక్తాపూర్‌లో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాముల్ నాయక్



నేరడిగొండ: కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఆడే గజేందర్

నార్నూర్: కాంగ్రెస్‌తోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రజా శ్రేయస్సు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం మండలంలోని గుంజాల, ముక్తపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. నాయకులు గజానంద్‌నాయక్, మండల అధ్యక్షుడు దేవరావ్ లోకండే, మాజీ జెడ్పీటీసీ బిరుజులాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ దాదే అలీ, దళితరత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, నాగోరావ్, జాక్రుల్లా ఖాన్, యువ నాయకుడు మహేందర్, గోవింద్, విలాస్‌ఆడే, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని కుంటాల(బి)లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండల కన్వీనర్ ఆడే వసంతరావు, కపిల్ దేవ్ జాదవ్, రవి, శంకర్, నవీన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ గంగారం, యాదవ్, గంగాప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌఠలో కాంగ్రెస్ ప్రచారం

బోథ్: మండంలోని కౌఠ బి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. గాజుల సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల పార్టీ

నేరడిగొండ: కాంగ్రెస్ పేదల పార్టీ అని మాజీ ఎమ్మెల్సీ రాముల్ నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, బీజేపీ అధికారంలో ఉన్నా ఇప్పటివరకు గ్రామాలకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. తమ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బానోత్ రాందాస్ నాయక్, భీముడు నాయక్, భూమన్న యాదవ్, మెహరాజ్ అహ్మద్, రంజిత్ నాయక్, జనార్దన్, శ్రీనివాస్, సుభాష్, కపిల్‌దేవ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్లమెంట్ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, నరేష్ జాదవ్, జెడ్పీటీసీలు నర్సయ్య, గణేశ్‌రెడ్డి, కోటేశ్వర్, చంటి, మహిమూద్‌ఖాన్ పాల్గొన్నారు. కాగా బోథ్ ఇన్‌చార్జి తీరుపై కొందరు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని మండిపడ్డారు.

కైలాస్‌నగర్: ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులతో పాటు నాయకులు వినూత్నరీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఫిల్టర్ బెడ్, రిక్షాకాలనీ, దస్నాపూర్, సంజయ్‌నగర్, రిమ్స్ ఏరియా, టైలర్స్‌కాలనీ, పోలీస్ కాలనీ, సుందరయ్యనగర్, నీలానగర్, భగత్‌సింగ్‌నగర్, ఇందిరానగర్, వడ్డెర కాలనీలలో కంది సాయి మౌనరెడ్డి మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కూరగాయలు తూకం వేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఆశమ్మ, నళినిరెడ్డి, ఇందిర, సుమ, శ్రీలేఖ తదితరులు ఉన్నారు.

ఎదులాపురం: ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు లంక రాఘవులు, బండి దత్తాత్రేయ, పూసం సచిన్‌లు అన్నారు. పట్టణంలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు మంజుల, జమున, శకుంతల, ఆరిఫా బేగం, ఆశన్న, పోసాని, రేణుక, ప్రభు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరిన్ని హామీలు అమలు చేస్తామని ఓటర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు సంతోష్, రామన్న, వెంకట్ రెడ్డి, నరేశ్, శ్రీధర్‌రెడ్డి, సీపీఐ నాయకులు దేవిదాస్, రమేశ్, అరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేల: గత పదేళ్లలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచడం తప్ప చేసేందేమి లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాంగ్రుడ్, కోగ్దూర్, కాప్సి(బి), షంషాబాద్, డోప్టాల, టాక్లీ, భవానీగూడ(ఇ), మశాల(బి), సైద్‌పూర్, డొన, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేశారు. మాజీ జెడ్పీటీసీ రాందాస్, మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, సంజయ్, ఘణేశ్యాం, సుధాం రెడ్డి, రూపేష్‌రెడ్డి, శంకర్, అవినాష్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.